## క్లుప్తంగా

### దోమల మందు పిచికారీ తప్పనిసరి



దోమల మందు పిచికారీ చేయిస్తున్న డాక్టర్ అనిల్ కుమార్

**వీఆర్‌పురం:** ప్రతి ఇంటిలో దోమల నివారణ మందును తప్పని సరిగా పిచికారీ చేయించుకోవాలని రేఖపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ రాజేష్, ఎంపీహెచ్ ఈవో సమ్మయ్య, హెచ్‌ఎ శ్రీనివాసు సత్యనారాయణ, ఏఎన్‌ఎం కె.పార్వతి, ఆశ కార్యకర్తలు నూతన, రాధ తదితరులు పాల్గొన్నారు

### వేసవి దుక్కులు ప్రారంభం



దుక్కు దున్నుతున్న గిరిరైతు

**అరకులోయటౌన్:** జిల్లాలో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గిరి రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. ఖరీఫ్ సాగుకు వేసవి దుక్కులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, చీడపీడల నివారణతోపాటు పంట దిగుబడి అధికంగా వస్తుందని రైతులు తెలిపారు. ఖరీఫ్‌లో వరి, చోడి(రాగులు) సాగు చేసేందుకు నారుమడులను సిద్ధం చేస్తున్నారు. అల్లం, సామలు, వేరుశెనగ, కొత్తిమీర, మొక్కజొన్న, కూరకాయల సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

### ఆశా కార్యకర్తలకు యూనిఫాం అందజేత



యూనిఫాంలు అందజేస్తున్న వైద్యాధికారి రాంబాబు

**దుంబ్రిగుడ:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు మంగళవారం వైద్యాధికారి పి.రాంబాబు నూతన యూనిఫాంలను అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది స్వామి, రవీంద్ర, లోవరాజు, హరికృష్ణ, ప్రభాకర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఝాన్సీరాణి

**అడ్డతీగల:** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పండా సతీష్ తెలిపారు. ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రి కౌన్సెలర్ వాసు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం పాడై పోవడమే కాకుండా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు.

### చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దు

**పాడేరు రూరల్:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. పాడేరు సచివాలయం-1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్యవివాహాలు,పోక్సో చట్టం,సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మి మాట్లాడుతూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీరాణి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్‌గా పదోన్నతి



సింహాచలంనాయుడు

**సాక్షి,పాడేరు:** హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కొట్టగుల్లి సింహాచలంనాయుడుకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జోన్లకు సంబంధించి జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# పరిహారం అందేదెన్నడో ?

ప్రాజెక్టు, కాల్వల నిర్మాణంతో సాగునీరు వస్తుంది.. తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్న ఆశతో భూములిచ్చేందుకు సహకరించారు. భూములు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇటు పరిహారం అందక.. అటు సాగునీరు రాక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అన్నివిధాలుగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందని అలుగువాగు ప్రాజెక్టు భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- భూములు కోల్పోయి కూలీలుగా మారిన గిరిజన రైతులు
- దశాబ్దాలుగా పరిహారం కోసం ఎదురుచూపులు
- అలుగువాగు ప్రాజెక్టులో నీరున్నా నెరవేరని లక్ష్యం



కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు(ఫైల్)

**ఎటపాక:** ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన **అలుగువాగు** ప్రాజెక్టు నిర్మాణం కోసం భూము**లు నష్టపోయిన** రైతులకు నేటికీ నష్టపరిహారం **అందలేదు.** ప్రాజెక్టు, కాలువల నిర్మాణంలో **భూములు** కోల్పోయిన తమకు పరిహారం **చెల్లిం**చాలని దశాబ్దాలుగా రైతులు **పోరా**డుతున్నప్పటికీ అధికారులు **పట్టిం**చుకోవడం లేదు. ఉన్న కొద్దిపా**టి** భూమి కోల్పోవడంతో వ్యవసా**య** కూలీలుగా మారారు.

మండల పరిధిలో**ని** కన్నాపురం సమీపంలో అలుగు**వా**గుపై ప్రాజెక్టు నిర్మాణానికి **గాను** ఉమ్మడిరాష్ట్రంలో ప్రభుత్వం **మొత్తం** రూ.6.49కోట్లు మంజూరు **చేసింది.** మొదటిగా మంజూరైన రూ.2.85 **కోట్లతో** అలుగు నిర్మించడంతో పాటు కట్టను **పటిష్టం చేసే** పనులను చేపట్టారు. అయితే ఈ **పనులు చేప**డుతున్న సమయంలోనే భారీ వర్షా**లు కురవడంతో** కట్ట తెగిపోయింది. కన్నాపురం, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన వందలాది ఎకరాలు అప్పట్లో ముంపునకు గురయ్యాయి. ఎట్టకేలకు కట్టను పటిష్టం చేయగా, ఈ వాగు నుంచి పంట పొలాలకు నీరు అందించేందుకు గాను కాలువ నిర్మాణం **కోసం** **మరో** రూ.3.64కోట్లు మంజూరయ్యాయి. అలుగు వాగు ప్రాజెక్టు నుంచి గొరిదేవి పేట వరకు ఎడమ వైపు 5.6కిలో మీటర్ల మేర, కుడివైపు 7.5కిలో మీటర్ల పొడవున కాలువలను నిర్మించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. ఎడమ వైపు **కా**లువ కింద 11వందల ఎకరాలు, కుడి **వైపు** కాలువ కింద 9వందల ఎకరాలకు **సాగు**నీరు అందించాలనేది లక్ష్యం. **అయితే** 2008లో ప్రారంభించిన ఈ పనులు **అసంపూర్తి**గానే వదిలేయడంతో లక్ష్యం నెరవేర**లేదు. దీంతో** సాగు భూములకు నీరందక రైతులు **తీవ్ర అసంతృ**ప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పరిహారం చెల్లిం**చకుండానే పనులు

ప్రాజెక్టు కింద భూములకు నీరందించేందుకు గాను రెండు వైపులా కాలువల తవ్వకం పనులు చేపట్టారు. ఈ పనుల్లో సుమారు 70మంది రైతులు భూములను కోల్పోయారు. వీరికి నేటికీ పరిహారం అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కాలువల నిర్మాణంతో సుమారు 100 ఎకరాలు కోల్పోగా, వీరిలో ఎక్కువ మంది గిరిజన రైతులే ఉన్నారు. కోట్లాది రూపాయలతో పనులు చేపట్టే ముందు ఇందుకు సంబంధించిన సమగ్ర సర్వే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అది తమ పని కాదంటూ పట్టించుకోకపోవడంతోనే బాధిత రైతులకు పరిహారం అందలేదని గిరిజన సంఘాలు అంటున్నాయి. పరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలంటూ ఎన్నో సార్లు ఉన్నతాధికారులకు ఐటీడీఏ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ తమ గోడు పట్టించుకునేవారే కరువయ్యారని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### అసంపూర్తిగా నిర్మాణ పనులు

అలుగువాగు ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో సాగునీరందక అన్నదాతలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలు తవ్వేందుకు చేసిన సర్వే ప్రకారం పనులు నిర్వహించకపోవడంతో భూములు ఎక్కువగా నష్టపోవాల్సి వచ్చిందని నిర్వాసిత రైతులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా కాలువ నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలివేయడంతో కాలువల ద్వారా వచ్చే వర్షపు నీటితో తమ పొలాలు మునిగిపోయి పంటలు సాగు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎడమ వైపు కాలువను గన్నవరం, గొరిదేవి పేట మధ్యగల ముమ్మడివరం చెరువులో కలుపవలసి ఉన్నప్పటికీ అలా చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. అలాగే కుడివైపు కాలువ నిర్మాణం కూడా అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఖరీఫ్ పంటను వేయలేక రైతులు ఆయా భూములను బీడు భూములుగానే వదిలేశారు.

#### పరిహారం నేటికీ అందలేదు



కాలువలను తవ్వడంతో ఉన్న రెండు ఎకరాల భూమిని కోల్పోయాను. అధికారులు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఇంత వరకు అందించలేదు. దీంతో ఉన్న కొద్ది సాగు భూమి కోల్పోయాం. – కడియం రామాచారి, గొరిదేవిపేట, ఎటపాక మండలం

#### అధికారులు పట్టించుకోవడం లేదు

భూములకు నష్టపరిహారాన్ని అందించాలని అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. సాగు చేసేందుకు భూమి లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు గిరిజన రైతులను ఆదుకోవాలి.
– దాని వెంకమ్మ, కృష్ణవరం, ఎటపాక మండలం

#### ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు

ప్రాజెక్టు నిర్మించి కాలువలు సక్రమంగా తవ్వకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో పనులు ఇష్టారాజ్యంగా చేశారు.
– తుర్రం చిట్టియ్య, గొందిరాజుపేట, ఎటపాక మండలం

### ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

**వీఆర్‌పురం :** ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయల పోస్టులను భర్తీ చేయాలని, జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయంగా మరో జీవో తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం జరిగిన వీఆర్ పురం మండల సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలను గిరిజనులచే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, ఎంపీటీసీలు పూనెం ప్రదీప్ కుమార్, భాగ్యలక్ష్మి, వాళ్ళ వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచులు పులి సంతోష్ కుమార్, పూనెం సరోజిని, పిట్టా రామారావు, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, సోడె నరసమ్మ, శారద, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### గొండోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సావిత్రి

**అడ్డతీగల:** గొండోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, బుధవారం నుంచి కొనుగోలు చేయనున్నట్టు ఏడీఏ సావిత్రి తెలిపారు. అడ్డతీగల మండలంలోని రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆమె చెప్పారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు రూ.2,300, 75 కిలోలు రూ.1,725కు కొనుగోలు చేస్తామన్నారు. ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,003, 75 కిలోలకు రూ.1,740 చెల్లించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యాన్ని పరిశీలించారు.

### వాటర్ ట్యాంక్ పనులకు భూమి పూజ

**అడ్డతీగల:** మండలంలోని డి.భీమవరంలో రూ. 34.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వాటర్ ట్యాంక్ పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం భూమి పూజ చేశారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఈ ట్యాంక్ నిర్మిస్తున్నారు.

## కుట్టు శిక్షణ పేరుతో కుంభకోణం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మరియదాసు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు

**కూనవరం:** కుట్టు శిక్షణ పథకం పేరుతో కూటమి ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు ఆరోపించారు. బీసీ నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్టు మిషన్ల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని తెలిపారు. నాసిరకం మిషన్లు పంపిణీ చేశారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పథకాన్నీ అమలు చేయలేదని తెలిపారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ఉన్న పింఛన్లు కత్తిరించే పనిలో పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దీకొండ గంగాధర్, బీసీ నాయకులు చెవుడుబోయిన మధు, చామంతుల వెంకన్న, కల్లం వీరాంజనేయులు, మేడిది నాగేంద్ర, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## పీసా కమిటీ ఎన్నిక పదోసారి వాయిదా



ఓటర్లు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

**వై.రామవరం:** వై.రామవరం పంచాయతీ పీసా కమిటీ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. దీంతో పదో సారి వాయిదా పడినట్టు అయింది. రెండు వందలకు పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవల్సి ఉండగా మంగళవారం 10 మంది మాత్రమే హాజరవడంతో ఎన్నిక జరగలేదు. ఎన్నికలో చేతులు ఎత్తి బహిరంగ మద్దతు తెలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తే అందరూ హాజరవుతారని గ్రామస్తులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా ఎన్నికపై విస్తృతంగా గ్రామంలో ప్రచారం చేసినప్పటికీ ఓటర్లు హాజరుకాక పోవడంతో అధికారులు నిర్ణీత సమయం ముగిశాక వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రత్యేక అధికారి, ఐటీడీఏ పీఏవో ఎల్.రాంబాబు, ఎంపీడీవో కె.బాపన్నదొర, ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.సతీష్, సచివాలయం డీఏ కనక ప్రసన్న, విఘ్నేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు



వై.రామవరం, అడ్డతీగల ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ



చాపరాయి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**వై.రామవరం:** మండలంలోని వై.రామవరం, అడ్డతీగల ప్రధాన రహదారిలో సీఐ బి. నరసింహమూర్తి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మండల సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం మేరకు ప్రధాన రహదారిలో వాహనాలను తనిఖీచేశారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేశారు.

**దుంబ్రిగుడ:** మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద మంగళవారం ఎస్ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో దుంబ్రిగుడ పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులేని వారికి జరిమానాలు విధించారు. గంజాయి వంటి పదార్థాలు రవాణాచేస్తూ పట్టుబడితే చట్టపరమైన శిక్ష తప్పదని ఎస్ఐ హెచ్చరించారు.

## నెల్లిపాక పీహెచ్‌సీ వద్ద నిరసన



డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్యకు వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

**ఎటపాక:** హెల్త్ సూపర్‌వైజర్లు,ఏఎన్‌ఎంలను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన ఎంఎల్‌హెచ్‌పీలు,అసోసియేషన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ నెల్లిపాక పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, ఏపీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ వారం రోజులుగా డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేస్తున్న వారి పట్ల అసభ్యకరంగా మాట్లాడి అవమానించిన అసోసియేషన్ బాధ్యులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు గౌతమి, నాగమణి, పీహెచ్ఎన్ అరుంధతి, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా పట్టాలమ్మ జాతర

**రాజవొమ్మంగి :** మండలంలోని ఒట్టిగెడ్డ గ్రామదేవత పట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవం చివరి రోజు మంగళవారం వైభవంగా జరిగింది. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కాంతారా నృత్యాలు, గరగ నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలచాయి.


### రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

**వీఆర్‌పురం:** బీసీ కాలనీ నుంచి రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మంగళవారం పరిశీలించారు. రోడ్డును సక్రమంగా నిర్మించలేదని, తారు వేయకుండా మధ్యలోనే కాంట్రాక్టర్ వదిలేశారని ఎంపీపీ కారం లక్ష్మి ఫిర్యాదు మేరకు పీవో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు.

### భూములు కోల్పోయిన గిరిజనులకు పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**ఎటపాక:** కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా చేసి, తహసీల్దార్ సుబ్బారావుకు, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఈసందర్భంగా పార్టీ డివిజన్ నాయకులు సాయన్న మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మించి రెండు దశాబ్దాలు పూర్తికావస్తున్నా భూములు కోల్పోయిన రైతులకు నేటికి పరిహారం ఇవ్వలేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని చెప్పారు.ఈకార్యక్రమంలో సుక్కయ్య,ఉదయ్,ఇరమయ్య,రాజమ్మ,నర్సింహారావు, లక్ష్మీదేవి,చిట్టిమ్మ పాల్గొన్నారు.

## కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



బాలికలతో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి



పెదబరడలో కిశోర బాలకల ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాసరావు,పెదబరడ సర్పంచ్ గోపాల్

**కొయ్యూరు:** కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. రాజేంద్రపాలెంలో బాలికలకు ఆరోగ్యంపై పూర్తి అవగాహన కల్పించారు.యుక్తవయస్సులో వచ్చే ఇబ్బందులను తెలిపారు.బాలికలను గ్రూపులుగా చేసి ఆటపాటలను నేర్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**గంగవరం:** మండలంలోని అముదాలబంద గ్రామంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌమరదశ, లైంగిక వేధింపులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

**చింతపల్లి:** కిశోర బాలికలు సెలవుల్లో భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలో గల పెదబరడ పంచాయతీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కిశోర బాలికలు సాధికారత మన అందరి బాధ్యతగా భావించాలన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ,ఆశ కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రంపచోడవరం:** బాల్య వివాహాలు వల్ల ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ, సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డిలు అన్నారు. తామరపల్లి లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బాల్య వివాహాలు, కౌమరదశ, గర్భధారణలపై అవగాహన కల్పించారు. గోపవరంలో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు లక్ష్మి, వీఏవో రామతులసి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీపై ఆర్డినెన్స్ జారీ చేయాలి




ఆదివాసీ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న సాధన కమిటీ సభ్యులు,నిరుద్యోగులు

**ముంచంగిపుట్టు:** ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీపై ఈ నెల 8వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి, ఆర్డినెన్స్ జారీ చేయాలని ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల అధ్యక్షులు రెయ్యల నాగభూషణం, కో-ఆర్డినేటర్ వెంగడ జగన్ డిమాండ్ చేశారు. పనసపుట్టు పంచాయతీ గిద్దులపుట్టు, ఒంటిపుట్టు, బొడ్డపడ గ్రామాల్లో మంగళవారం సాధన కమిటీ నాయకులు పర్యటించి, జీవో నంబర్ 3ను పునరుద్ధరించకపోవడం వల్ల కలుగుతున్న నష్టాలపై నిరుద్యోగులకు వివరించారు. ఈ సందర్భంగా నాగభూషణం,జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని,అధికంగా ఉపాధ్యాయ పోస్టులు కోల్పోతున్నామని, జీవో నంబర్ 3కు బదులుగా ప్రత్యామ్నాయ జీవోను తీసుకువచ్చి ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాలు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 9వ తేదీన భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి,ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు శ్రీనివాసపడాల్, సతీష్, ప్రవీణ్‌కుమార్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు,ఆశా కార్యకర్తలు

**ముంచంగిపుట్టు:** కార్మికులకు ఇబ్బంది కలిగించే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని కిలగాడ,లబ్బూరు పీహెచ్‌సీల పరిధిలో పని చేస్తున్న ఆశ వర్కర్లతో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, కార్మికుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్చాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అంతకుముందు లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారులకు సీఐటీయూ నాయకులు,ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు.